భీష్మస్తవరాజము

టీకాతాత్పర్య విశేషార్థాంధ్రపద్య
సమేతము

గ్రంథకర్త:

కవిశేఖర పల్లె పూర్ణప్రజ్ఞాచార్యులు.

శ్రీ పూర్ణప్రజ్ఞగ్రంథమాల - అష్టాదశకుసుమము.

శ్రీ హయగ్రీవాయ నమః

భీష్మస్తవరాజము

టీకాతాత్పర్య విశేషార్థాంధ్రపద్య
సమేతము

గ్రంథకర్త

కవిశేఖర పల్లె పూర్ణప్రజ్ఞాచార్యులు

గుంటూరు హిందూకళాశాలా సంస్కృతాధ్యాపకులు,

శ్రీ ఎలమర్తి గోదావరమ్మగారి ద్రవ్యసాహాయ్యమున

గుంటూరు

వ్యాయామకళా పవర్ ప్రెస్సు నందు

ముద్రింపబడినది.

1951

(ప్రథమ ముద్రణము 500)

సర్వస్వామ్యములు గ్రంథకర్తవి)

(వెల రు 0-6-0

శ్రీ హయగ్రీవాయ నమః

తొలిపలుకు

భీష్ముఁడు కర్మయోగియుం జ్ఞానయోగియు నగునొకమహావ్యక్తి. మహాత్యాగి. లోకమున 'వేధా ద్వేధా మతిం చక్రే కాంతాసు కనకేషు చ' అన్నట్లు కాంతాకనకంబులయందు భ్రాంతి లేనివా రరుదు. కాని యిమ్మహాపురుషుఁ డట్టివాఁడు గాఁడు. మత్స్యగంధిని తనమాతృశ్రీని గా నొనర్చుకొన దాశరాజు కోరినమేరకుఁ దనరాజ్యమును దండ్రినిమిత్తము త్యాగ మొనర్చెను. భావిసోదరులభవిష్యదుదయమునకై ప్రణయినీప్రేమ సామ్రాజ్యమును సైతము పరిహరించెను. అంతే కాదు; తాతా! నిన్ను జయింపఁ దరముగాకున్న దని తహతహలాడుధర్మజునికై ప్రాణముల బలియొసంగెను. ఆహా! ఈపరమయోగిజీవిత మంతయుఁ బరార్థమే కదా! కనుకనే భగవానుం డగుశ్రీకృష్ణుఁడు 'ఋణం ప్రవృద్ధ మివ మే' అన్నట్లు పెచ్చుపెరిఁగిపోవుచున్నయాతనిసేవాఋణమును దీర్చుకొనఁ బ్రయత్నించెను. అంతకాలమున ధర్మోపదేశవ్యాజమున సత్వగుణమును బెంపొందింపఁ జేసెను. శ్రవణవ్యాజమున సందర్శన మొసంగెను. తత్ప్రతిజ్ఞ నెఱవేర్పఁ జక్రముఁ బూని పైనుఱుకు తనసన్నివేశము స్మరణకుఁ దెప్పించెను. వేయేల 'అంతకాలే చ మా మేవ స్మరన్ ముక్త్వా కళేబరమ్ యః ప్రయాతి స మద్భావం యాతి నా స్త్యత్ర సంశయః' అనుగీతాశ్లోకమునకు భక్తుఁ డగుభీష్ముని లక్ష్య మొనర్చెను. కాని భీష్ముఁ డీయవకాశమును స్వార్థమునకే యుపయోగించుకొని స్మరణముచేతనే తరింప నిచ్ఛగింప లేదు. వాచనిక మగునీస్తవము ననుగ్రహించి ముముక్షూద్ధరణమునకు ముచ్చటపడినాఁడు. అవసానసమయమున నేనియు నార్యు లుపకారమునకే మఱురు. ఆమహానుభావుఁడు స్మరణముచేతనే తరించినచో లోకమున కీస్తవము కఱ వయ్యెడిది కదా! తాను తరించి లోకమును తరింపఁ జేయఁ జరమోపదేశంబుగాఁ భీష్ముఁడు ప్రసాదించినయీస్తవము స్తవరాజ మనుట కెట్టిసంశయ ముండదు. ఈ స్తవరాజమును నిత్యానుసంధాన మొనర్చుటకు నే నొనర్చినయీకృషి లోకమున కుపకరించిన నే నెంతయుఁ గృతార్థుఁడను.

వికృతిమార్గశీర్ష బహుళైకాదశి
3–1–51

ఇట్లు
గ్రంథకర్త

కృతజ్ఞత

సీ॥ శ్రీహనుమాయీసుశీల సుబ్బాచార్యు లన్నవా రేసతిం గన్నవారు
సుబ్బాంబికాతనూజుండు శ్రీవెంకటాచార్యుఁ డేసద్గుణధుర్యభర్త
పెదపరదేశినాఁ బేర్వడ్డయాచార్య మౌళి యేయెలనాఁగమామగారు
ఆత్రేయపరమపవిత్రగోత్ర మ్మొప్ప నెలమర్తి యేయమ్మయింటిపేరు

గీ॥ ఆమె పేరనే గోదావరమ్మ గాదు సరసతా, నిర్మలత్వ, ప్రసన్నభావ,
సాధుదర్శన, తద్వచశ్శ్రవణ, పూతతాదులం గూడ గోదావరమ్మ యామె.

శా॥ ఎం దెందుం బోఁగ యుందు నందు భువి వహ్నిం జాటు వ్యాప్తిన్ బలెన్
సందేహం బిఁక నేల? మంచి పనులే చాయన్ బ్రవర్తిల్లునో!
యం దం దీయమ యుండు; దాని కిఁక దృష్టాంతమ్మ! యీముద్రిణా
సందర్భాదికమే, యకించనులకున్ శక్యంబులే యిప్పనుల్ ?

శా॥ సేవించెన్ బదరీపతిన్ హరిని, గాశీముఖ్యముల్ క్షేత్రముల్
నైకవల్యప్రదముల్ చరించె, గనె గంగాద్వారమున్; జేసె స
త్సేవన్, బ్రహ్మకపాలమందుఁ బిత్రు సంతృప్తిన్ బొనర్చెన్, మఱె
న్నో విష్ణువ్రతముల్ పొనర్చె, సఫలా యుర్భాగ్య యీయమ్మయే.

ఆ॥ వె॥ గుణపవిత్రయైన గోదావరమ్మకు శుద్ధభక్తి నీడుజోడువారు
శబరివకుళవంటిచానలే యని యెంతు ఈమె శ్రీశుకరుణ నెనయుఁగాక.

*

సమర్పణము

అంకితముం బొనర్చె భవ
దంఘ్రి కెవండు నిజాత్మ యట్టినీ
కింకరుఁ డాపగేయుఁ డోలి
కించుచు భక్తిని మాట మాట నీ
వంకనె గాంచు చేస్తవము
వాకొనె; దానికిఁ డీక వ్రాసి యో
పంకజనాభ! కృష్ణ! తమ
పాదములం దిడితిన్ సుమంబుగన్.

శ్రీ హయగ్రీవాయనమః

టీకా తాత్పర్య విశేషార్థాంధ్రపద్య సహిత

భీష్మస్తవరాజము

—◆—

భీష్మ ఉవాచ.........

శ్లో॥ ఇతి మతి ముపకల్పితా వితృష్ణా
భగవతి సాత్వత పుంగవే విభూమ్ని
స్వసుఖ ఉపగతే క్వచి ద్విహర్తుం
ప్రకృతి ముపేయుషి యద్భవప్రవాహః. 1

టీక:— భీష్మః = భీష్ముఁడు, ఉవాచ = పలికెను. (దీనివలన ఈస్తుతి వాచనిక మని తెలియుచున్నది.) ఇఁక శ్లోకార్థము వ్యాఖ్యానింపఁ బడుచున్నది. క్వచిత్ = ఒకప్పుడు (సృష్టి కాలమున) విహర్తుమ్ = క్రీడించుటకు, యత్, భవ, ప్రవాహః = ఏ చేతనాచేతనప్రకృతివలన సంసారప్రవాహము (పరంపర) (భవతి = అగుచున్నదో, తామ్ = అట్టి) (ప్రకృతిమ్ = ప్రకృతిని, ఉపేయుషి = పొంది యున్నట్టియు, (ప్రకృతినిబొందియున్నను) స్వ, సుఖే = స్వరూపభూత మగునానందము కలిగినట్టియు, ఉపగతే = సమీపమున నే యున్నట్టియు, విభూమ్ని = పరిపూర్ణుఁడైనట్టియు, భగవతి = షడ్గుణైశ్వర్యసంపన్నుఁడైనట్టియు, సాత్వత, పుంగవే = యాదవశ్రేష్ఠుఁడగు శ్రీకృష్ణునియందు, వితృష్ణా = విషయములయందు ఆశ లేని, ఇతి = ఏవంవిధ మగు, మతిః = బుద్ధి, ఉపకల్పితా = సమర్పింపఁ బడినది.

తా:— భీష్ముఁ డంపసెజ్జపై నుండి యప్పుడే ధర్మ రాజాదులకు ధర్మోపదేశము గావించి యద్దానిని శ్రీకృష్ణుఁడు గీతలో

'య త్కరోషి య దశ్నాసి య జ్జుహోషి దదాసి చ
య త్తపస్యసి కౌంతేయ! త త్కురుష్వ మదర్పణమ్'

అని చెప్పినట్లు లాయుపదేశమును గృష్ణార్పణ మొనర్చు చున్నాఁడు.

సృష్టికాలమున నానారూపములతోఁ గ్రీడించుట కేప్రకృతివలన సంసారపరంపర కలుగుచున్నదో యట్టిప్రకృతిని బొందియు స్వస్వరూపానందము గల్గి దేశతః కాలతః గుణతః పరిపూర్ణుఁడై షడ్గుణైశ్వర్యసంపన్నుఁడై చెంతనే యున్న యాదవసింహుఁ డగు శ్రీకృష్ణునందు ఆసన్నమరణుఁ డగుభీష్ముఁడు విషయతృష్ణారహిత మగు తనమతిని సమర్పించెను.

విశేషములు:— 'వితృష్ణా' అనుచోట విషయతృష్ణారాహిత్యముతోఁ బాటు 'సంతతం చింతయే ఽనంత మంతకాలే విశేషతః' అన్నవిధముగా ఆసన్నమరణుఁ డగుభీష్మునకు భగవచ్చింత ముఖ్యతమము.

'విః పక్షి పరమాత్మనోః' అనునిఘంటుప్రకారము 'వి' శబ్దమునకుఁ బరమాత్మ యనునర్థముగలదు గాన 'వి=పరమాత్మయందు తృష్ణా=ఆశగల' అను విశేషము దెలియనగును.

ఈశ్లోకమున విశేషణము లన్నియు సాభిప్రాయములుగాఁ బ్రయుక్తములు గాన 'అలంకారః పరికరః సాభిప్రాయ విశేషణే' అనులక్షణమునుబట్టి పరికరాలంకారము. ఎట్లన—

విభూమ్ని = పరిపూర్ణుఁడు, అనఁగా అపరిచ్ఛేదలక్షణ మగు పూర్ణత దేశకాలములకుఁ గూడఁ గలదు గాన తద్వ్యావృత్తికై 'భగవతి' అని వాడఁబడినది, అదియు నేబుషియందేని గోచరించునేమో యని 'సాత్వతపుంగవే' అని వేయఁ బడినది. 'క్వచిద్విహర్తుం ప్రకృతి ముపేయుషి' క్రీడార్థము ప్రకృతిని బొందుచున్నాఁ డనుటవలన అది లేనప్పు డానందహానిస ముండ వలయు నను మందాశంక 'స్వసుఖే'=స్వరూపానందము గల వాఁడు అనుపదముచే నివారింపఁ బడినది. ఇది దిక్ప్రదర్శనము. ఇట్లే అంతట నెఱుంగునది.

శ్లో॥ త్రిభువనకమనం త మాలవర్ణం
రవికరగౌరవరాంబరం దధానే
వపు రలకకులావృతాననాబ్జం
విజయసఖే రతి రస్తు మే ఽనవద్యా. 2

టీక:— త్రిభువన, కమనమ్= మూఁడు లోకములయందును గోరఁదగినదియు, తమాల, వర్ణమ్=చీఁకటిమ్రానిపూవురంగు గలదియు, రవి... అంబరమ్... రవి=సూర్యునియొక్క, కర = (ఉదయ) కిరణమువలె, గౌర=ఎఱ్ఱని, వర=శ్రేష్ఠ మగు, అంబరమ్ =వస్త్రము గలదియు, అలక... అబ్జమ్ —అలక=ముంగురులయొక్క, కుల=సంతతిచే, ఆవృత=ఆవరింపఁబడిన, ఆనన+అబ్జమ్ =తామరవంటి మొగము గలదియు నగు, వపుః=శరీరమును, దధానే = ధరించుచున్న, విజయసఖే = అర్జునునకుమిత్రుఁ డగు శ్రీకృష్ణునియందు, మే=నాకు, నిరవద్యా=నిర్దుష్ట మగు (ఫలకామనాది దోషములులేని) రతిః=భక్తి, అస్తు=అగుఁ గాక.

తా:— ముజ్జగములవారికిఁ గోరఁ దగినదియు, తమాల కుసుమమువలె నీల మైనదియు, ఉదయభానునికిరణములవలె

ఎఱ్ఱని మేలివలువ గలదియు, ముంగురులచే ఆవరింపఁబడిన ముఖపద్మము గలదియు నగుమనోహరశరీరముగల పార్థసఖుఁడగు శ్రీకృష్ణునియందు నాకు నిర్దోష మగుభక్తి కలుగుఁ గాక.

విశే:— త్రిభువనకమనమ్= (తనయందు) మూఁడు లోకములకును కామము గలదియు అనిచెప్పుకొన్నచోఁ త్రిజగన్మోహన మనునర్థము వచ్చును. 'విజయసఖే' కృష్ణునిసఖిత్వముచే అర్జునునకు విజయత్వము సిద్ధించుచున్న దని హృదయము. 'మేరతిః, అనవద్యా, అస్తు' నాభక్తి నిర్దుష్ట మైనదియగుఁ గాక. భక్తికి దోష మనఁగా రాగాదులతోఁ గూడియుండుట 'రతి' శబ్దమునకు రాగ మర్థ మైనను పూజ్యులయందలిరాగము భక్తి యగుటంజేసి భక్తి యని వ్రాయఁబడినది. రసవంతములుగానుండుటచే ఈశ్లోకముల కున్నంతవఱకుఁ బోతనభాగవత పద్యములనే పొందుపఱచుచున్నాను.

మ॥ త్రిజగన్మోహనసీలకాంతి తను వు
ద్దీపింపఁ బ్రాభాతనీ
రజబంధుప్రభ మైనచేలము పయిన్
రంజిల్ల నీలాలక
వ్రజసంయుక్తముఖారవింద మతిసే
వ్యంబై విజృంభింప మా
విజయుం జేరెడువన్నెలాఁడు మది నా
వేశించు నెల్లప్పుడున్.

శ్లో॥ యుధి తురగరజోవిధూమ్రవిధ్యత్
కచలులితశ్రమవార్యలంకృతాస్యే
మమ నిశితశరై ర్విభిద్యమాన
త్వచి విలసత్కవచే ఽస్తు కృష్ణ ఆత్మా. 3

టీక:— యుధి = యుద్ధమునందు, తురగ...ఆస్యే, తురగ = గుఱ్ఱములయొక్క, రజః = (గిట్టలచే రేగిన) ధూళిచే, విధూమ్ర = మిక్కిలినలుపు మించు నెఱుపు గలవియు (మాసినవియు) విధ్యత్ = చిక్కువడుచున్న వియు నగు, కచ = ముంగురులందు, లులిత = కదలుచున్న, శ్రమవారి = చెమటచే, అలంకృత = అలంకరింపఁబడిన, ఆస్యే = మొగము గలవాఁడును, మమ = నాయొక్క, నిశిత, శరైః = వాడియమ్ములచే, విభిద్యమాన, త్వచి = చీల్చఁబడుచున్న చర్మము గలవాఁడును, విలసత్, కవచే = ప్రకాశించుచున్న కవచము గలవాఁడును, అగు, కృష్ణే = శ్రీకృష్ణునియందు, (మమ = నాయొక్క) ఆత్మా = మనస్సు, అస్తు = ఉండుఁగాక

తా:— యుద్ధమునందు గుఱ్ఱపుగిట్టలచే రేగఁ గొట్టఁబడినపరాగములచే మాసినముంగురులయందుఁ గదలాడు చెమటబొట్టులచే నలంకరింపఁ బడినమోము గలవాఁడును, ప్రకాశమాన మగుకవచము గలవాఁడైనను నావాఁడియమ్ములచేఁ జీల్పఁబడుచున్న చర్మము గల శ్రీకృష్ణునందు నాచిత్తము లగ్న మగుఁ గాక.

విశే:— 'శ్రవణంవిష్ణునిందాయాః' అని అపరాధశతములోఁ జెప్పఁబడినట్లు దుర్యోధనకృతనిందలవినుటయేగాక, దానికన్నను మిన్నగ అపరాధ మొనర్చి వాఁడిబాణముల నొప్పించినయీమహాపరాధిని క్షమించుచునాచిత్తము నీయందే

లగ్న మొనర్చుకొని 'అంతకాలే చ మామేవ స్మరన్ ముక్త్వా
కళేబరమ్, యః ప్రయాతి సమద్భావం యాతి నాస్త్యత్రసంశయః'
అని గీతలలో నీవు సెలవిచ్చినట్లు నా కంతిమస్మృతిని గలిగించి
నన్నుఁ దరింపఁ జేయు మనుభీష్ముని వేఁడికోలు ఇట సూచింపఁ
బడినది. 'మమనిశితశరై ర్విభిద్యమానత్వచి' భగవంతునిశరీర
మప్రాకృతము జ్ఞానానందాత్మకము నగుటచే నట్టిశరీరము నిశిత
శరవిభిద్యమానత్వచ మగుటయు ఉత్తరశ్లోకముల 'క్షతజపరి
ఫుతః' అనుటయు విరుద్ధములు గదా! యని శంకింప రాదు.
ఆసురజనమోహనార్థమై వ్యాసులవా రట్లు చెప్పిరి. చూడుఁడు.

> 'అసంగ శ్చావ్యథో౽భేద్యో౽ నిగ్రాహ్యో శోష్య ఏవచ
> విద్ధో౽ సృగంచితో బద్ధ ఇతి విష్ణుః ప్రదర్శ్యతే.
> అసురాణ్ మోహాయన్ దేవః క్రీడయైవ సురే ష్వపి
> మానుషాన్ మధ్యయా దృష్ట్వా న ముక్తేషు కథంచన.

ఇతిస్కాందే — భాగ — తా — ౯అ

అట్లేని ముక్తపురుషులకు దేవతలకుఁ దోఁచు అవిరుద్ధార్థమే మన— '<u>విప్రియః</u>' అనుచోట విశేషప్రియుఁడనియు, ప్రియుఁడు కానివాఁ డనియు 'వి' అనుఉపసర్గ చెప్పుచున్నట్లే యిక్కడను 'విభిద్యమాన' అనుచోట 'వి' అను ఉపసర్గ వ్యతిరేకార్థమునే చెప్పును. కాన, విభిద్యమానత్వచి= చీల్చఁబడనిచర్మము గల, అనుఅవిరుద్ధార్థమే ముక్తాదుల కగుచున్నది. నావాఁడివాఁడిబాణములు గూడ శ్రీకృష్ణునిచర్మము

నేనియు భేదింపఁ జాలకున్నవి యనుటచే భగవంతునియభేద్య త్వాదులు వ్యక్తము లగుచున్నవి. ఇట్లే ఉత్తరత్రి చూచు కొనునది.

'విలసత్కవచే' అనుదానితోఁ గూడ 'మమనిశిత శరైః' అనుదాని నన్వయించుకొన్నచో నావాఁడిబాణములచేఁ బ్రకాశించుకవచముగలవాఁ డని యర్థ మేర్పడును. అప్పుడు కృష్ణునికవచము నిండ భీష్మునివాఁడిబాణములు గ్రుచ్చుకొని యున్న వనిగాని, భీష్మునివాఁడిబాణములే శ్రీకృష్ణునకుఁ గవ చమువలె శరీరమును గప్పియున్నవి యని గాని విశేషార్థము స్ఫురించును. లేదా — 'వ, బయోరభేదః' అనునియమముచే 'విలసత్' పదము 'బిలసత్' అని యగును. అప్పుడు 'బిలే సీదతి ఇతి' 'బిలసత్' అనువ్యుత్పత్తిచే (కలుగునందుండునది) పాము అను అర్థ మేర్పడును. కాఁగా బిలసత్, కవచే=పా మగు శేషుఁడుశయ్యగాఁ గలవాఁ డనువిశేషార్థము వచ్చును. ఇదియే ముక్తపురుషాదులకు గోచరించునర్థము.

మ॥ హయరింఖాముఖధూళిధూసరపరి
న్యస్తాలకోపేతమై
రయజాతశ్రమ తోయబిందుయుతమై
రాజిల్లు నెమ్మోముతో
జయముం బార్థున కిచ్చువేడ్క నన నా
శస్త్రాహతిం జాల నొ
చ్చియుఁ బోరించుమహానుభావు మదిలోఁ
జింతింతు నశ్రాంతమున్.

శ్లో॥ సపది సఖివచో నిశమ్య మధ్యే
నిజపరయో ర్బలయో రథం నివేశ్య
స్థితవతి పరసైనికాయు రక్ష్ణా
హృతవతి పార్థసఖే రతి ర్మమాస్తు. 4

టీక:— సఖివచః = చెలికాఁ డగు అర్జునునిమాటను, నిశమ్య = విని, సపది = వెంటనే, నిజపరయోః = స్వీయపరకీయము లగు, బలయోః = సేనల యొక్క, మధ్యే = నడుమ, రథమ్ = రథమును, నివేశ్య = ఉంచి, స్థితవతి = ఉన్నట్టియు, పర, సైనిక, ఆయుః = శత్రుసైనికుల ఆయుర్దాయమును, అక్ష్ణా = చూపుచేతనే, హృతవతి = హరించినట్టియు, పార్థసఖే = అర్జునుని నెచ్చెలియగు శ్రీకృష్ణునియందు, మమ = నాకు, రతిః = భక్తి, అస్తు = అగుఁగాక.

తా:— 'సేనయో రుభయో ర్మధ్యే రథం స్థాపయ మేఽచ్యుత' అనుమిత్రుఁ డగునర్జునునిమాట నాలించి వెంటనే యుభయసేనలనడుమ రథము నిల్పి అడుగో! భీష్ముఁడు, అడుగో! ద్రోణుఁడు, అడుగో! కర్ణుఁ డని చూపుచునే శత్రుసైనికుల యాయుఃప్రాణముల నపహరించినపార్థసారథియందు నాకు నిశ్చలభక్తి కుదురుఁ గాక.

విశే:— 'సఖివచః' ఏ మనఁగా 'సేనయో రుభయో ర్మధ్యే రథం స్థాపయ మేఽచ్యుత యావ దేతాన్ నిరీక్షేఽహం యోద్ధుకామా నవస్థితాన్' (యుద్ధముసేయుతలంపుతో వచ్చిన యోధులను జూడ వలయును గాన శ్రీకృష్ణా! నారథము నుభయసేనలనడుమ నిలుపుము) అని. 'సైనికాయుఃఅక్ష్ణా హృతవతి' (శ్రీకృష్ణుఁడు చేత నాయుధముఁ బట్టకయే భక్తి

వాత్సల్యముతోఁ జేసినమహాసాహాయ్య మిదియే. భీష్మాదులఁ జూపు నెపముతోఁ జూపుచేతనే కౌరవసైనికులప్రాణములను గుంజివేసెను. కనుకనే,

'మయైవైతే నిహతాః పూర్వ మేవ నిమిత్తమాత్రం భవ సవ్యసాచిన్' అనియు, 'ద్రోణం చ భీష్మం చ జయద్రథం చ కర్ణం తథాఽన్యా నపి యోధవీరాన్। మయా హతాం స్త్వం జహి మావ్యథిష్ఠాః' అనియు గీతలో నిదివఱకే నేను భీష్మాదులఁజంపితి ననుట పొసఁగు చున్నది.

మ॥ నరుమాటల్ విని నవ్వుచో నుభయసే
నామధ్యమక్షోణిలోఁ
బరు లీక్షింప రథంబు నిల్పి పరభూ
పాలావళిం జూపుచుం
బరభూపాయువు లెల్లఁ జూపునన శుం
భత్కేళి వంచించునీ
పరమేశుండు వెలుంగు చుండెడును హృ
త్పద్మాసనాసీనుఁడై.

శ్లో॥ వ్యవసితపృతనాముఖం నిరీక్ష్య
స్వజనవధా ద్విముఖస్య దోషబుద్ధ్యా
కుమతి మహరదాత్మవిద్యయా య
శ్చరణరతిః పరమస్య తస్య మేఽస్తు.

అవ:— అర్జుననినిమిత్త మొనర్చుకొని గీతోపదేశముచే సకలజనుల నుద్ధరింపఁ బూనిన శ్రీకృష్ణునివాత్సల్యగుణము ననుసంధించుచు నీశ్లోకమున భీష్ముఁడు ప్రార్థించుచున్నాఁడు.

టీక:— వ్యవసితపృతనాముఖమ్=(రణమున మరణించుటద్వారా స్వర్గమును బొందుటకు) నిశ్చయించుకొన్న సేనలో ముఖమువలె ముఖ్యముగానున్న భీష్మాదివీరవర్గమును, నిరీక్ష్య=తేఱిపాఱఁ జూచి, దోషబుద్ధ్యా=దోషమనుబుద్ధితో, స్వ, జన, వధాత్=బంధుజనమును జంపుటనుండి? విముఖస్య=పెడమొగము గల అర్జునునియొక్క, కుమతిమ్=చెడుబుద్ధిని, తానుచంపుచున్నా ననుబుద్ధిని, లేదావిపరీతబుద్ధిని, యః=ఎవఁడు, ఆత్మవిద్యయా=అధ్యాత్మవిద్యచే (గీతోపదేశముచే) అహరత్=పోగొట్టెనో, తస్య=అట్టి, పరమస్య=పరమాత్మయొక్క, చరణరతిః=పాదభక్తి, మే=నాకు, అస్తు=అగుఁగాక.

తా:— 'మదర్థే త్యక్తజీవితాః' అని దుర్యోధనుఁడు చెప్పినట్లు ప్రాణముల నర్పించియైనను రారాజునకు విజయము సంపాదింప నిశ్చయించుకొని సేనాముఖమున నిల్చియున్న భీష్మద్రోణాదివీరులఁ జూచి 'న చ శ్రేయోఽనుపశ్యామి హత్వా స్వజన మాహవే' అనియు 'న కాంక్షే విజయం కృష్ణ!' అనియు పలికి 'రథోపస్థ ఉపావిశత్' రథమునుండి కళకళ బడిన యర్జునుని విపరీతజ్ఞానమును గీతోపదేశముచే వారించి 'కరిష్యే వచనం తవ' అనునట్లు చేసినపరమపురుషుఁడగు శ్రీకృష్ణునియందు నాకు నిశ్చలభక్తి కలుగుఁగాక.

విశే:— కొన్నిప్రతులయందు 'వ్యవసితపృతనాముఖ' మ్మనుచోట 'వ్యవహితపృతనాముఖ' మ్మని యున్నది. అప్పాఠము

వ్యవహిత=దవ్వుననున్న, అనియర్థము.

'స్వజనవధాత్, విముఖస్యదోషబుద్ధ్యా–' 'గురూనహత్వా హి మహానుభావాన్ శ్రేయో భోక్తుం భైక్ష్య మపీహలోకే' అనిస్వధర్మ మగుయుద్ధము దుష్ట మనియుఁ బరధర్మ మగు భైక్ష్యము శ్రేయఃప్రద మనియుఁ బొరపడి 'న యోత్స్య ఇతి గోవింద ముక్త్వా తూష్ణీం బభూవ హ' అని మొండికి వేసినయర్జునునియొక్క, అంత గట్టిగాఁ బాదుకొనిన విపరీత జ్ఞానమును, అనిభావము.

'కుమతి మహర దాత్మవిద్యయా యః' చూపుచే శత్రువీరులప్రాణములను హరించుటమాత్రమే గాదు; అధ్యాత్మవిద్యచేఁ బరమమిత్రుఁ డగుఅర్జునునిఅజ్ఞానమును గూడ హరించె నని భావము. సాయము చేయ ననుచునే యెంతసాయము చేసినాఁడు! పరమాత్మభక్తవాత్సల్య మట్టిది.

'కుమతిమ్' దేహాత్మభ్రమమును, లేదా, స్వధర్మము నందు దోషబుద్ధిని, పరధర్మమునందు శ్రేయోబుద్ధిని,

'అహరత్'– నివారించెను.

'నష్టో మోహః స్మృతి ర్లబ్ధా త్వత్ప్రసాదా న్మయాఽచ్యుత । స్థితోఽస్మి గతసందేహః కరిష్యే వచనం తవ' (కృష్ణా! నీ అనుగ్రహముచే అజ్ఞానము పోయినది. జ్ఞానము కలిగినది. సందేహములు లేవు. నీఆజ్ఞ నొనర్తును)

క॥ తనవారిఁ జంపఁ జాలక
వెనుకకుఁ బో నిచ్చగించువిజయునిశంకన్
ఘనయోగవిద్యఁ బాపిన
మునివంద్యునిపాదభక్తి మొనయున్ నాకున్.

శ్లో॥ స్వనియమ మపహాయ మత్ప్రతిజ్ఞా
మృతమధి కర్తు మవప్లుతో రథస్థః
ధృతరథచరణోఽభ్యయా ద్బలాగ్రే
హరి రివ హంతు మిభం గతోత్తరీయః. 6

అవః— ఇందు భీష్ముఁడు స్వప్రతిజ్ఞాఫలక మగుభక్త వాత్సల్య మనుసంధానించుచు శ్రీకృష్ణుని ధ్యానించుచున్నాఁడు. 6, 7, శ్లోకములకు ఏకాన్వయము,

టీక:— (యః = ఎవఁడు) స్వ నియమమ్ = తన ప్రతిజ్ఞను, (నేనుయుద్ధమున ఆయుధమును బట్టను అను ప్రతిజ్ఞను) అపహాయ = విడిచి పెట్టి, మత్, ప్రతిజ్ఞామ్ = నాప్రతినను (యుద్ధమున శ్రీకృష్ణునిచే ఆయుధమును పట్టింతును అనునాప్రతినను) ఋతమ్ + అధి = సత్యమునందు, (ఉపసర్గకు పరనిపాతము ఛాందసము) కర్తుమ్ = చేయుటకు, రథస్థః రథమున నున్నవాఁడగుచు, అవప్లుతః = దుమికినవాఁడై, ధృత, రథచరణః = ధరింపఁబడినచక్రాయుధము కలవాఁడై, గత + ఉత్తరీయః = పోయిన పైబట్ట కలవాఁడై, ఇభమ్ = ఏనుఁగును, హంతుమ్ = చంపుటకు, హరిః ఇవ = సింహమువలె, బల + అగ్రే = సేనాముఖమునందు, (స్థితమ్=ఉన్న, మామ్ = నన్ను,) అభ్యగాత్ = ఎదుర్కొనెనో, (భగవాన్ = షడ్గుణైశ్వర్యసంపన్నుఁడును, ముకుందః = ముక్తిప్రదుఁడును, అగు, సః = ఆ శ్రీకృష్ణుఁడు, మే = నాయొక్క, ముదే = సంతోషముకొఱకు, భవతు = అగుఁగాక, అనియుత్తర శ్లోకముతో అన్వయము)

శ్లో॥ శితవిశిఖహతో విశీర్ణ దంశః
క్షతజపరిప్లుత ఆతతాయినో మే
ప్రసభ మభిససార మద్వధార్థం
స భవతు మే భగవాన్ ముదే ముకుందః. 7

టీక :— (యః = ఎవఁడు) ఆతతాయినః = వధోద్యుక్తుఁడ నగు, మే = నాయొక్క, శిత, విశిఖ, హతః = వాఁడిబాణములచేఁ గొట్టఁబడిన వాఁడును, విశీర్ణ, దంశః = ధ్వంసముచేయఁ బడిన కవచము గలవాఁడును, క్షతజ, పరిప్లుతః = నెత్తుటి స్నానము చేసినవాఁడును, ఐ, ప్రసభమ్ = బలాత్కారముగా, (రథము దిగకుము, ఆయుధముఁ బూనకుము, భీష్ముని జంపకుము, అని అర్జునుఁడు వారించుచున్నను అనిభావము) మత్, వధార్థమ్ = నన్నుఁ జంపుటకొఱకు, అభిససార = ఎదురుగా వచ్చెనో, సః = అట్టి భగవాన్ = షడ్గుణైశ్వర్యసంపన్నుఁ డగు, ముకుందః = మోక్షదాత యగు శ్రీకృష్ణుఁడు, మే = నాయొక్క, ముదే = సంతోషముకొఱకు, భవతు = అగుఁ గాక.

తా:— (పై రెండుశ్లోకములకు) యుద్ధమున ఆయుధముఁ బట్టనను తనప్రతినను సైతము మానుకొని, యేమహానుభావుఁడు 'యుద్ధమునందు శ్రీకృష్ణునిచే నాయుధముఁ బట్టింతు, నన్న నాప్రతిజ్ఞను సత్యమొనర్ప నావాఁడిబాణములచేఁ గొట్టఁబడి విచ్ఛిన్నకవచుఁడై నెత్తుటఁ దోఁగుచు రథమునుండి దుమికి వలదు వల దని యర్జునుఁడు వారించుచున్నను లెక్కసేయక జాఱినయుత్తరీయము నేనియు గుర్తింపక చక్రముఁ గొని మోదుపై కుఱుకుసింగమువోలె నామీఁదికుఱికివచ్చు భగవానుఁ డగు శ్రీకృష్ణుఁడు నా కానందముఁ గల్గించుఁ గాక.

వి శే:— (6, 7, శ్లోకములకు)

(శ్లో 6) 'స్వనియమ మపహాయ మత్ప్రతిజ్ఞామృత మధికర్తుమ్' భగవంతునకుభక్తప్రతిజ్ఞా పరిపాలనమే తనప్రతిజ్ఞకు ఫలము గాన భీష్మప్రతిజ్ఞ నెఱవేర్చి తనప్రతిజ్ఞను సఫల మొనర్చు కొనెను. 'ధృతరథచరణః' చూపులచేతనే శత్రువులసంహరింపఁ గల్గశ్రీకృష్ణుఁడు చక్రాయుధముఁ బట్టుటభక్తప్రతిజ్ఞను పాలించుటకుఁ గాని-చోమ తెందులకు ?

'హరి రివ హంతు మిభమ్' సింహముకలలోఁగనపడినప్పుడే యేనుఁగు గడగడలాడు నన్న ఎదుటఁ గనఁబడినప్పుడు వేఱే చెప్ప వలయునా ? అని భావము. భక్తిజ్ఞానసంపన్నుఁడయ్యు భీష్ముఁ డర్థాశచే దుర్యోధను నాశ్రయించుకతన నజ్ఞాని యేయనునాశయముతోఁ మందబుద్ధి యగుమత్తేభముతోఁ బోల్చఁబడెను. హరిసామ్యమువలన శ్రీకృష్ణునియందు శౌర్యాది గుణములు వ్యంగ్యము లగుచున్నవి.

'గతోత్తరీయః' భక్తప్రతిజ్ఞాపరిపాలనాపారవశ్యమున భగవంతుఁడు మీఁదివలువ జాఱుటయు గమనింప లేదని భావము.

(7 శ్లో) 'శితవిశిఖహతో విశీర్ణదంశః' మూఁడవశ్లోకము నందువలెనే యిటఁ గూడ ఆసురజనమోహనార్థము విశీర్ణదంశత్వ, క్షతజపరిప్లుతత్వాదికము వర్ణింపఁ బడినది గాని సత్యము గాదు. కనుక 'వి, శీర్ణదంశః' అనుచోట ధ్వంసము చేయఁబడని కవచము గలవాఁ డని చెప్పుటయే యప్రాకృతవిగ్రహుఁ

డగుపరమాత్మపట్ల సమంజసము. వాఁడిబాణములఁ గొట్టఁబడినను ధ్వంసముగానికవచము గలవాఁ డని చెప్పుటచే భగవంతునిఅభేద్యత్వాదులు వెల్లడి యగును.

'క్షతజపరిప్లుతః' పామరులకు నెత్తుట స్నాన మాడిన వానివలె నని భావము. జ్ఞానానందస్వరూపుఁ డగుభగవంతునకు నెత్తు రెక్కడిది? 'ఆతతాయినః' ఆతతాయీ వధోద్యతః అనునిఘంటువునలన ధన్వియై వధోద్యుక్తుఁ డగుభీష్ముఁ డిట ఆతతాయిగాఁ జెప్పఁ బడెను. లేదా— 'అగ్నిదో గరదశ్చైవ' అనురీతిగా సర్వవిధముల ఆతతాయి యగుదుర్యోధను పక్షమున నుండుటచే 'తత్సంయోగీచపంచమః' అన్నట్లు భీష్ముఁ డాతతాయిగాఁ జేర్కొనఁబడెను.

'ప్రసభమ్' ప్రతిజ్ఞను జ్ఞప్తిచేయుచు 'చక్రము గొనవలదు, భీష్ముని జంప వలదు,' అని అర్జునుఁడు సేయుబలాత్కార మిట గ్రాహ్యము.

ఇందు 6 వ శ్లోకమున, 'స్వనియమమ్,' అనుచోట 'స్వనిగమమ్' అని పాఠాంతరము. అర్థము సమానమే, మూఁడవపాదమున 'బలాగైః' అనుచోట 'చలద్గుః' అని పాఠాంతరము గలదు. చలత్=కదలుచున్న, గుః=భూమి గలవాఁడుఅని అర్థము. భగవంతుఁడు రథమునుండి దుమికినపుడు భూమి కదలిన దని భావము. శ్రీపోతన యీపాఠమును బట్టియే తెనిఁగించినాఁడు.

7 వ శ్లోకముచివర 'ముదే ముకుందః' అనుచోట 'గతి ర్ముకుందః' అని పాఠాంతరము, గతిః=దిక్కు, పైరెండు శ్లోకములకుఁ బోతనామాత్యుఁడొకేసీసపద్యమును వ్రాసెను.

సీ॥ కుప్పించి యెగసినఁ గుండలంబుల కాంతి
గగనభాగం బెల్లఁ గప్పికొనఁగ
నుఱికిన నోర్వక యుదరంబులో నున్న
జగముల వ్రేఁగున జగతి గదలఁ
జక్రంబుఁ జేపట్టి చనుదెంచు రయమునఁ
బైనున్న పచ్చనిపటము జాఱ
నమ్మితి నాలావు నగుఁబాటు సేయకు
మన్నింపు మని క్రీడి మరలఁ దిగువఁ

గీ॥ గరికి లంఘించుసింహంబుకరణి మెఱసి
నేఁడు భీష్ముని జంపుదు నిన్నుఁ గాతు
విడువు మర్జున! యనుచు మద్విశిఖవృష్టిఁ
దెరలి చనుదెంచు దేవుండు దిక్కు నాకు.

శ్లో॥ విజయరథకుటుంబ ఆత్తతోత్రే
ధృతహయరశ్మిజితశ్రియేక్షణీయే
భగవతి రతి రస్తు మే ముమూర్షో
ర్య మిహ నిరీక్ష్య హతా గతాః స్వరూపమ్. 8

అవ:- భగవానునియొక్క అర్జునోపకారబుద్ధిని అవసాన

కాలమున దర్శనమాత్రముచే మోక్ష మొసంగుశక్తిని అను సంధించుచు భీష్ముఁడీశ్లోకముతో నుతించుచున్నాఁడు.

టీక :— ఇహ = ఈయుద్ధమున, యమ్ = ఎవని, నిరీక్ష్య = చూచి, హతాః = చంపఁబడినవారు, స్వరూపమ్ = భగవత్స్వరూపమును, గతాః = పొందిరో, తస్మిన్ = అట్టియు, విజయ, రథ, కుటుంబే = అర్జునునిరథమే కుటుంబముగాఁ గలిగినట్టియు, (కుటుంబమువలె రక్షణీయముగాఁ గలవాఁడును) ఆత్తతోత్రే = పొందఁబడినమునికోల గలవాఁడును, ధృత... ఈక్షణీయే — ధృత = పట్టుకొనఁబడిన, హయ = గుఱ్ఱములయొక్క, రశ్మి = పగ్గములు గలవాఁడును, జితశ్రమ = గెలువఁబడినశ్రమగలవాఁడును, (శ్రమను లెక్క సేయనివాఁడనుట) ఈక్షణీయే = అందగాఁడును, భగవతి = షడ్గుణైశ్వర్యసంపన్నుఁడగుశ్రీకృష్ణునియందు, ముమూర్షోః = మరణింపఁదలఁచిన, మే = నాకు, రతిః = భక్తి, అస్తు = అగుఁగాక.

తా:— ఎవని దర్శనమాత్రముచేతనే రణనిహతులు స్వరూపమును లేదా మూలరూపమును, లేదా సారూప్య మోక్షమును బొందిరో యట్టిమహానుభావుఁడును, అర్జునుని రథమును గుటుంబమునుబోలె రక్షణీయముగాఁ దలఁచినవాఁడు కనుక నే చేత మునికోలఁ బూని గుఱ్ఱపుఁబగ్గములఁ బట్టుకొని సుకుమారుఁ డయ్యు శ్రమనుగణింపక ప్రతిజ్ఞాభంగాదుల కేనియు సమ్మతించి చతుర్దశభువనాధికారి యగుతన కనుచిత మనుకొనక పార్థసారథిబిరుదమును గణించినభక్తవత్సలుఁ డగు శ్రీకృష్ణభగవానునియందు నాకు భక్తి స్థిర మగుఁగాక.

వి శే:— 'విజయరథకుటుంబే' అర్జునరథమును కుటుంబముగాఁ బోల్చుటచే 'అప్యకార్యశతం కృత్వా భర్తవ్యా

మను రబ్రవీత్' (వందలకొలంది అకార్యముల నొనర్చి యైనను కుటుంబమును భరింప వలయును) అని మనువు చెప్పినట్లు ఎన్ని యుపాయముల చేతనో శ్రీకృష్ణుఁడు పార్థరథమునుగాపాడెను. అర్జునరథమును గాపాడుటనుటయనఁ అర్జునుఁ గాపాడుటే.

గీతోపదేశముచే రణాభిముఖుని జేయుట, భీష్ముని జంపఁ జక్రము పట్టుట, శిఖండిచాటుననుండి భీష్మునిపై బాణముల వేయించుట, సైంధవవధలో మరలఁ జక్రమును సూర్యుని కడ్డమొనర్చుట, 'అశ్వత్థామాహతః' అనిపించుట, సర్వముఖాస్త్రమునుండి రథమును రథికుని గాపాడుట ఇత్యాదు లెన్నని యూహ్యములు.

మ॥ తనకున్ భృత్యుఁడు వీనిఁ గాచుట మహా
ధర్మంబు వో మ్మంచు న
ర్జునసారథ్యము బూని పగ్గములు చేఁ
జోద్యంబుగాఁ బట్టుచున్
మునికోలన్ వడిఁ బూన్చి ఘోటకములన్
మోదించి తాడించుచున్
జనులన్ మోహము నొందఁ జేయుపర మో
త్సాహుం బ్రశంసించెదన్.

శ్లో॥ లలితగతివిలాసవల్గుహాస
ప్రణయనిరీక్షణకల్పితోరుమానాః
కృత మనుకృతవత్య ఉన్మదాంధాః
ప్రకృతి మగుః కిల యస్య గోపవధ్వః. 9

అవ:- మదాంధలగు గోపకాంతలు కామముచేతఁ దన్ను ధ్యానించినమాత్రముననే ముక్తి నొసఁగినశ్రీకృష్ణుఁడు స్వవర్ణాశ్రమవిహితధర్మపురస్సరముగా సేవించువారికి మోక్ష మొసంగుట కైముత్యన్యాయసిద్ధ మని యీశ్లోకమున భీష్ముఁడు శ్రీకృష్ణుని నుతించుచున్నాఁడు.

టీక :— లలిత .. మానాః — లలిత = అందము లగు, గతి = నడకలచేతను, విలాస = (రాసలీలాది). విలాసములచేతను, వల్గు = అందమగు, హాస = నవ్వుచేతను (చిఱునవ్వు) ప్రణయ, నిరీక్షణ = ప్రేమావలోకనములచేతను, కల్పిత = చేయఁ బడిన, ఉరు = గొప్ప, మానాః = పూజ గలవారై, ఉత్, మద, అంధాః = అధికమదముచేఁ గన్నులు గాననివారై, గోపవధ్వః = గోపకాంతలు, యస్య = ఏశ్రీకృష్ణునియొక్క, కృతమ్ = (పూతనావధాది) కార్యమును, అనుకృతవత్యః = అనుకరించినవారగుచు, (యస్య = ఏశ్రీకృష్ణునియొక్క) ప్రకృతిమ్ = నిర్దుఃఖపరమానందస్వభావమును, అగుఃకిల = పొందిరో, (తస్మిన్ = అట్టి, భగవతి = భగవానునియందు, మే = నాకు, రతిః = భక్తి, అస్తు = అగుఁగాక, అని వెనుక శ్లోకముతో నన్వయము)

విశే:-'లలితగతివిలాసవల్గుహాసప్రణయనిరీక్షణకల్పితోరుమానాః' లలితగతివిలాసాదులుస్వీయములుగానికృష్ణసంబంధములుగానికావచ్చును. 'కిల' ఈఅవ్యయముప్రమాణ ప్రసిద్ధిని దెలుపును.

ప్రణయ=కోపముచే, అవలోకన=చూపులచే అనియు నర్థము చెప్పుకొన వచ్చును. 'యస్య' (అనుగ్రహాత్) ఎవని దయవలన అట్టిస్వభావమును (బొందిరోయని)

క॥ పలుకుల నగవుల నడపుల
నలుకల నవలోకనముల నాభీరవధూ
కులములమనముఁల తాలిమి
కొలుకులు వదలించుఘనుని గొలచెద మదిలోన్.

శ్లో॥ మునిగణనృపవర్యసంకులేఽన్తః
సదసి యుధిష్ఠిర రాజసూయ ఏషామ్
అర్హణా మభిపేద ఈక్షణీయో
మమ దృశి గోచర ఏష ఆవి రాత్మా. 10

అవ:— సర్వజగదగ్రపూజ్యుఁ డగుశ్రీకృష్ణుఁడు సామాన్యుఁ డగుతనయందు అకారణకరుణఁ జూపుచు నంతకాలమున దర్శన మిచ్చుట తనభాగ్యమని భీష్ముఁడు భగవద్వాత్సల్యమునకు ముగ్ధుఁ డగుచున్నాఁడు.

టీక :— (యః = ఏమహానుభావుఁడు) యుధిష్ఠిరరాజసూయే = ధర్మజునిరాజసూయయాగమున, ముని, గణ, నృప, వర్య, సంకులే = మునిసమూహముచేతను, రాజశ్రేష్ఠులచేతను, నిండిన, అంతస్సదసి = సభామధ్యమున, ఏషామ్ = ఏమునిరాజన్యాదులలో, అర్హణమ్ = అగ్రపూజను, అభిప్రపేదే = పొందెనో, సః = ఆ, ఏషః = ఈ, ఆత్మా = సర్వాంతర్యామి యగుపరమాత్మ, ఈక్షణీయః = దర్శనీయుఁడై, మమ = నాకు, దృశి గోచరః = దృష్టివిషయుఁడై, ఆవిః = ఎట్టయెదుట సున్నాఁడు (అహో = ఏమి నాఅదృష్టము!)

తా:— మునికులముచేతను రాజకులముచేతను నిండిన ధర్మజురాజసూయములో సభామధ్యమున సర్వవిధయోగ్య

తలచే ఏమహానుభావుఁ డగ్రిపూజ నందెనో, ఆసర్వాంత ర్యామి యగు పరమాత్మ కృష్ణరూపమున దర్శనీయుఁడై నన్ననుగ్రహింప మరణకాలమున నాకంటికి గోచరించుచు నెదుటనే యున్నాఁడు. ఏమి నాభాగ్యము !

విశే:— 'అర్హాణ' దీనినిజదువునపుడు 'అరహాణ' అని చదివినచో ఛందోవ్యత్యాసము రాదు. 'అపిమాషం మషం కుర్యాత్ ఛందోభంగం న కారయేత్' అనికదా ! అభి యుక్తోక్తి. ఏకాక్షరవ్యత్యాస మంతగాఁ బాటింపఁ దగనిది.

ఆవిః=ప్రకటోవర్తతే=ప్రత్యక్షమై యెదుటనున్నాఁడు.

ఆ॥ వె॥ మునులు నృపులుఁ జూడ మును ధర్మజునిసభా
మందిరమున యాగమండపమునఁ
జిత్రమహిమతోడఁ జెలువొందుజగదాది
దేవుఁ డమరు నాదు దృష్టియందు.

శ్లో॥ త మిహ మహ మజం శరీరభాజాం
హృది హృది విష్ఠిత మాత్మకల్పితానామ్
ప్రతిదృశ మివ నైకథాఽర్క మేకం
మమ ధిగతోఽస్మి విధూతభేదమోహః. 11

అవ:— పరమాత్మ సర్వాంతర్యామి యైనచో స్థానభేద ప్రయుక్తభేదము పరమాత్మయందుఁ బ్రాప్తింపదా ? అను శంక రాఁగా సర్వప్రాణులయందున్నను సర్వత్ర యున్నపర

మాత్మ యొక్కఁడే తద్రూపములందు భేద మేమాత్రము లేదని ప్రత్యక్షానుమానప్రమాణములచే నిరూపించుచు భీష్ముఁడు భగవంతుని బ్రార్థించుచున్నాఁడు.

టీక :— అహమ్ = నేను, విధూత, భేద, మోహః = పోయిన (భగవంతునియందలి స్థానగత మగు) భేదభ్రాంతి గలవాఁడనై, ప్రతిదృశమ్ = ప్రతిప్రాణిదృష్టియందు (తత్త్వాభిమానినై) న+ఏకధా = నైకధా = అనేకవిధములుగా నున్న, అర్కమ్ = సూర్యుని, ఏక మివ = ఒక్కనిని వలెనే, ఆత్మ, కల్పితానామ్ = తనచే సృజింపఁ బడిన, శరీరభాజామ్ = దేహధారులయొక్క, హృది, హృది = ప్రతిహృదయమునందు, వి + స్థితమ్ = (విష్ఠితమ్) వివిధరూపములతో నున్న, తమ్ = ఆఅంతర్యామి పరమాత్మను, ఇహ = ఇచ్చట (నాయెదుట) ఉన్న, అజమ్ = జననరహితుఁ డగుశ్రీకృష్ణుని, ఏకమ్ = ఒకనినిగానే (అభిన్నుని గానే) అధిగతః = తెలిసికొన్న వాఁడను, అస్మి = అగుచున్నాను.

తా:— నేను పరమాత్మయందు స్థానగతభేదభ్రాంతి లేనివాఁడనై ప్రతిప్రాణిదృష్టిలోను చక్షురభిమానినై బహువిధములఁ దోఁచుసూర్యుఁ డొక్కఁడే యైనట్లు తనచే సృజింపఁ బడినప్రాణులహృదయములందు వివిధరూపములతో గోచరించు అంతర్యామియు ఇచ్చట నాకన్నులకు దర్శన మిచ్చుచున్న శ్రీకృష్ణపరమాత్మయు నొక్కఁడే యని తెలిసికొనుచున్నాను. నేనే గాదు జ్ఞాను లెల్లరు నట్లే తెలిసికొనుచున్నారు.

వి శే:— 'విధూతభేదమోహః' ఇందలి 'భేదమోహ' శబ్దముపారిభాషికము. అర్థ మే మన.

'ఈశస్య పూర్ణతాజ్ఞానం విష్ణోరన్యస్య చేశతా

భేద స్తస్యావతారేషు జీవ స్యేశత్వ మేవచ తథాజీవత్వ మీశస్య జడాభేద స్తయో రపి। భేదమోహా ఇతి ప్రోక్తః'

1. ఈశ్వరునియందు అపూర్ణతాజ్ఞానము,

2. ఈశ్వరునకు అన్యునకును నియామకత్వము,

3. పరమాత్మకు, అవతారములకును, అవతారములలో అవతారములకును పరస్పర భేదము గల దనుకొనుట,

4. జీవుని ఈశ్వరుఁ డనుకొనుట,

5. ఈశ్వరుని జీవుఁ డనుకొనుట,

6. జీవేశ్వరులకు జడములతో అభేదము,

పై ఆఱింటికి 'భేదమోహ' మని పేరు. విధూత-త్రోసివేయఁ బడిన, భేదమోహాః=పైఁ బేర్కొనఁ బడినభేద మోహము గలవాఁడనై అనియుఁ జెప్పికొనవచ్చును.

ఈ విషయమును సాధించుట కీక్రిందివిధముగా అనుమానరచనఁ గావించుకొనునది.

సర్వాంతర్యామీ పరమాత్మా (పక్షము) స్వగతభేద శూన్యః (సాధ్యము) చేతనత్వాత్ (హేతువు) తత్త్వాభిమానివత్ (సపక్షము) సర్వాంతర్యామియగుపరమాత్మ చేతనుఁడు గనుక తత్త్వాభిమానిసూర్యునివలెనే స్వగతభేదము లేనివాఁడు. అని తెలుచున్నది.

మ॥ ఒకసూర్యుండు సమస్తజీవులకుఁ దా
నొక్కొక్కఁడై తోఁచుపో
లిక నే దేవుఁడు సర్వకాలము మహా
లీలన్ నిజోత్పన్న జ
న్యకదంబంబులహృత్సరోరుహములన్.
నానావిధానూనరూ
పకుఁడై యొప్పుచు నుండు నట్టిహరి నేఁ
బ్రార్థింతు శుద్ధుండనై.

శ్లో॥ క్షితిభర మవరోపితుం కురూణాం
శ్వసన ఇవాసృజ దక్షవంశవహ్నిమ్
త మిమ మజ మనువ్రతార్తిహాంఘ్రిం
హృది పరిరభ్యజహామి మర్త్యనీడమ్. 12

అవ:— జూదమే భూభారహరణనిమిత్త మనిప్రసిద్ధి యుండఁగా శ్రీకృష్ణుఁడు భూభార మడఁగించె నని చెప్పుట యెట్లనుశంకకు సమాధాన మిచ్చుచు స్తోత్రఫలమును సూచించుచు స్వకర్తవ్యము నిందు నిరూపించుచున్నాఁడు.

టీక :— శ్వసనః = వాయువు, (వంశవహ్నిమ్) ఇవ = వెదురుల యందు (పరస్పరసంఘర్షమువలన) అగ్నిని వలె, (యః = ఏమహానుభావుడు) క్షితిభరమ్ = భూభారమును, అవరోపితుమ్ = దింపుటకు, కురూణామ్ = కౌరవులలో, అక్ష, వంశ, వహ్నిమ్ = జూదము అనెడు వెదురునిప్పును, (వెదురునిప్పు భగ్గు మనియొకమారే మండును) లేదా — జూద మను పేర వంశములో నిప్పును, అసృజత్ = సృజించెనో (పెట్టెనో) అనువ్రత + ఆర్తి + హా + అంఘ్రిమ్ = ఆశ్రితులబాధలను నశింపఁజేయుపాద

షడ్గుణైశ్వర్యసంపన్నుఁ డగు, కృష్ణే = శ్రీకృష్ణునియందును, ఆత్మానమ్ = అంతఃకరణమును, మనః, వాక్, దృష్టి, వృత్తిభిః = మనోవృత్తిచేత, వాగ్వృత్తిచేత, నేత్రవృత్తిచేతను, ఆవేశ్య = ప్రవేశపెట్టి, సః = ఆభీష్ముఁడు, అంతః శ్వాసః = ప్రాణాయామముచే నిరోధింపఁబడినశ్వాసగలవాఁడై, ఉపారమత్ = యోగశక్తిచే భౌతికశరీరమును వీడెను.

తా:— పైరీతిగా భీష్ముఁ డంతర్యామి యగుపరమాత్మయందును బహిర్గతుఁ డగుశ్రీకృష్ణపరమాత్మయందును మనస్సును లగ్న మొనర్చి యోగశక్తిచే భౌతిక దేహమును విసర్జించెను.

శ్లో॥ సంపద్యమాన మాజ్ఞాయ భీష్మం బ్రహ్మణి నిష్కలే
సర్వే బభూవు స్తే తూష్ణీం వయాంసీవ దినాత్యయే.

టీక :— తే = (ధర్మములవినవచ్చిన) వారు, సర్వే = అందఱును, భీష్మమ్ = భీష్ముని, నిష్కలే = షోడశకళారహిత మగు, లేదా - కర్మసంబంధము లేని, బ్రహ్మణి = పరబ్రహ్మమునందు, సంపద్యమానమ్ = పొందియున్నవానినిగా, ఆజ్ఞాయ= తెలిసికొని, దిన + అత్యయే = సాయంకాలమున, వయాంసి, ఇవ = పక్షులవలె, తూష్ణీం బభూవుః = ఊరకుండిరి.

తా:— భీష్మునివలనధర్మములువినవచ్చినవా రెల్లరు భీష్ముఁడు పరబ్రహ్మమును బొందినవిషయము నెఱింగినవారై జ్ఞానులు గాన శోకింపక సాయంకాలమునందలిపక్షులవలె ఊరకుండిరి.

విశే:— 'బ్రహ్మణి, సంపద్యమానమ్' మరణమునకు మున్నే బ్రహ్మయం దసంప్రజ్ఞాతసమాధిని జెంది తరువాత

మూలరూపమును బొందినవానినిగా అని భావము.

శ్లో॥ తత్ర దుందుభయో నేదు ర్దేవగంధర్వవాదితాః
శశంసుః సాధవో బ్రహ్మన్ ఖాత్ పేతుః పుష్పవృష్టయః.

టీక :— హేబ్రహ్మన్ = ఓబ్రాహ్మణుఁడా (శౌనకా) తత్ర = అక్కడ, దేవగంధర్వవాదితాః = దేవతలచేగంధర్వులచే, వాయింపఁబడినవై, దుందుభయః = నగారాలు, నేదుః = మ్రోగినవి, సాధవః = సజ్జనులు, శశంసుః = ప్రశంసించిరి, ఖాత్ = ఆకాశమునుండి, పుష్పవృష్టయః = పూలవానలు, పేతుః = పడినవి.

తా:— భీష్మునకు మోక్షము కలిగినందులకు ఆనందమును వెలిబుచ్చుచు దేవగంధర్వులు నగారాలు మ్రోగించిరి. సజ్జనులు ప్రశంసించిరి. ఆకసమునుండి పూలవానలు కురిసినవి. పైశ్లోకంబులకు శ్రీపోతనార్యునివచనము.

వ॥ అనియిట్లుమనోవాగ్దర్శనంబులం బరమాత్ముం డగు కృష్ణుని హృదయంబున నిలిపికొని నిశ్వాసంబువాని నిరుపాధికం బయినవాసుదేవబ్రహ్మంబునందుఁ గలసినభీష్ముం జూచి సర్వజనంబులు దివసావసానంబున విహంగంబు లూరకయుండు తెఱంగున నుండిరి. దేవమానవవాదితంబులై దుందుభినినదంబులు మొరసె. సాధుజనకీర్తనంబులు మెఱసెఁ గుసుమవర్షంబులు గురిసె.

క॥ ఇది భీష్మస్తవరాజము
ముదమునఁ బఠియించి శ్రేయములఁ బడయఁగఁ గో

శ్రీ పూర్ణప్రజ్ఞ గ్రంథమాల

ముద్రణమునకు సిద్ధముగనున్న గ్రంథములు.

1 శతలక్షణి (వ్యాకరణ విమర్శగ్రంథము)
2 కావ్యాలోకము (అలంకార గ్రంథము)
3 శ్రీ టీకాకృత్పాదాష్టకము టీకాతాత్పర్య విశేషార్థసహితము
4 శ్రీ దశావతార స్తోత్రము (ఆంధ్ర వివరణ సమేతము)
5 భాగవతస్కంధసారము

ఇందు ప్రతి స్కంధమునుండి ఉద్ధృతములగు మూఁడు మూఁడు శ్లోకములకు విశేషార్థ తాత్పర్యములతో టీక వ్రాయఁబడినది. అర్థ జ్ఞానపురస్సరముగా నిత్యపారాయణానుకూలము.

6 ముకుందమాల టీకాతాత్పర్యవిశేషార్థాంధ్ర పద్య సహితము
7 పాషండ మతఖండనము (ఆంధ్రము)
8 త్రిపురసుందరీ స్తుతిః (టీకా తాత్పర్యసహితా)
9 కనకదుర్గాష్టకమ్ (టీకా తాత్పర్యసహితమ్)

ఆంధ్రీకృతనాటకములు

10 ప్రతిమానాటకము
11 దూతవాక్యము
12 చారుదత్తము
13 దూతాంగదము

కావ్యములు

14 గోవర్ధనసుభాషితములు
15 విరక్తబుదము
16 పుష్పబాణవిలాసము
17 హైమవతీవిలాసము

విక్రయమునకు సిద్ధముగా నున్న గ్రంథములు

1	శ్రీరామకళ్యాణము, (ప్రబంధము)	1-0-0
2	ఆంధ్రకాదంబరి (పూర్వార్ధము)	1-8-0
3	,, (ఉత్తరార్ధము)	1-0-0

— విక్రయమునకు సిద్ధముగానున్న గ్రంథములు —

4	ఆంధ్రకాదంబరి (భాగద్వయము క్యాలికో బైండు)	3-0-0
5	ద్విపద మేఘదూతము	1-0-0
6	కైకేయీసౌశీల్యము	1-0-0
7	ప్రతిజ్ఞాయౌగంధరాయణము	1-0-0
8	దూతఘటోత్కచము	0-6-0
9	ఉషాహరణము (ఆంధ్రప్రబంధము)	1-0-0
10	శ్రీపురుషోత్తమవైభవము ,,	0-12-0
11	శ్రీ పూర్ణబోధ విజయము ,,	1-4-0
12	శ్రీజయతీర్థ విజయము (అమూల్యము)	
13	శ్రీవ్యాసరాయ విజయము	1-0-0
14	శ్రీవాదిరాజవిజయము	1-4-0
15	శ్రీ రాఘవేంద్ర విజయము (ప్రబంధము)	1-0-0
16	శ్రీరుక్మిణీశవిజయము ప్రథమభాగము	1-4-0
17	డిటో ద్వితీయభాగము 1-4-0 డిటో తృతీయభాగము	1-4-0
19	ప్రాతఃస్మరణీయరమేశస్తుతి టీకాతాత్పర్య విశేషార్థాంధ్రపద్యసహితము	0-2-0
20	శ్రీరాఘవేంద్రస్తోత్రము (అమూల్యము)	
21	శ్రీజయతీర్థస్తోత్రము (సటీకాతాత్పర్యాదికము)	0-8-0
22	ద్వాదశస్తోత్రము (పూర్వార్ధము, ఉత్తరార్ధము) (సటీకాతాత్పర్య విశేషార్థపద్యానువాదము)	1-4-0
23	డిటో (పూర్వార్ధము)	1-0-0
24	డిటో (ఉత్తరార్ధము)	0-8-0
25	ఆత్మసమర్పణము	1-0-0
26	శ్రీపురుషోత్తమవైభవమ్ (సంస్కృతమ్)	0-12-0
27	రామాష్టకమ్ (సాశ్వధాటి) ,,	0-4-0
28	మంగళాద్రినృసింహాష్టకమ్ ,,	0-1-0
29	మంత్రాలయమహిమాభివర్ణనమ్ ,,	0-1-
30	శ్రీసత్యధ్యానగురుస్మృతిః ,,	0-4-
31	శ్రీకనకదుర్గాష్టకమ్ ,,	0-1